సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురి అరెస్ట్

రౌడీషీట్ తెరవనున్నట్టు ఏసీపీ త్రినాథ్ వెల్లడి

అక్కిరెడ్డిపాలెం: దొంగ అనే అనుమానంతో అకారణంగా వ్యక్తిపై భౌతిక దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ముగ్గురిని గాజువాక పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారిపై రౌడీషీట్ తెరవనున్నట్టు సౌత్ ఏసీపీ త్రినాథ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మంగళవారం ఆయన వెల్లడించారు. గుర్తు తెలియని వ్యక్తి వాంబేకాలనీలో సోమవారం రాత్రి సమయంలో ఒక దగ్గర మంచినీరు తాగుతున్నాడు. ఆ సమయంలో కాలనీకి చెందిన ఏ.వెంకటరమణ, జి.వెంకటరమణ, జి.హేమంత్ గుర్తు తెలియని వ్యక్తిని పలు ప్రశ్నలు వేశారు. ఆ వ్యక్తికి మాటలు సరిగ్గా రాకపోవడంతో ముగ్గురు అతన్ని దొంగగా భావించి విచక్షణా రహితంగా కొట్టారు. తీవ్ర గాయాలతో ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో ఆ వ్యక్తి చనిపోయాడని భయపడి దాడి చేసిన వారిలో ఎ.వెంకటరమణ అనే వ్యక్తి గాజువాక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న సీఐ పార్థసారథి సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు. ఆ వ్యక్తిని కొట్టడానికి గల కారణాలను సేకరించారు. కాలనీకు చెందిన ముగ్గురు అకారణంగా కొట్టారని గుర్తించి అరెస్ట్ చేశామని ఏసీపీ త్రినాథ్ తెలిపారు.

డొంకాడలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదనలు

ఆర్‌ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామకృష్ణ

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీల్లో భవిష్యత్ విద్యుత్ అవసరాలు, సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు వీలుగా సెక్టార్–1 డొంకాడ కాలనీలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని ఆర్‌ఈసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి (ఏపీఈపీడీసీఎల్ ఈఈ)రామకృష్ణ చెప్పారు. 'సాక్షి' దినపత్రిలో ఇటీవల విద్యుత్ వెతలు అనే శీర్షికతో వెలువడిన కథనంపై అగనంపూడి సెక్షన్ కార్యాలయ పరిధిలో అధికారుల బృందంతో పలు ప్రాంతాలను పరిశీలించామని ఆయన పేర్కొన్నారు.మంగళపాలెంలో అదనపు సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో లో ఓల్టేజీ సమస్య దాదాపు పరిష్కారం అయిందని, అగనంపూడి నిర్వాసితకాలనీల అవసరాల నిమిత్తం రూ.మూడున్నర కోట్లతో ప్రతిపాదనలు పంపించామని తెలిపారు.అవసరమైన చోట సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

సీఐఎస్‌ఎఫ్ కమాండెంట్ జితేంద్రబాబు బాధ్యతల స్వీకరణ


జితేంద్రబాబు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐఎస్‌ఎఫ్ యూనిట్ నూతన కమాండెంట్‌గా జితేంద్ర బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు యూనిట్ సీనియర్ కమాండెంట్‌గా విధులు నిర్వహించిన అతహర్ మహ్మద్ హనీఫ్ భిలాయ్‌లోని సీఐఎస్‌ఎఫ్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో బాధ్యతలు స్వీకరించిన జితేంద్రబాబు ఇంత వరకు జమ్ముకశ్మీర్‌లోని దుల్‌హస్తి హైడ్రో ఎలక్ట్రిక్ ప్లాంట్‌లో కమాండెంట్‌గా విధులు నిర్వహించారు. 2008 బ్యాచ్‌కు చెందిన జితేంద్రబాబు స్వస్థలం విశాఖనగరంలోని కంచరపాలెం.

ట్రాఫిక్ పోలీస్ బీట్ షెల్టర్‌కు అడ్డంగా ప్రకటన బోర్డు


ఆటోన గర్ సిగ్నల్ పాయింట్ వద్ద పోలీస్ బీట్‌కు అడ్డంగా ప్రకటన బోర్డు

అక్కిరెడ్డిపాలెం: అన్ని వైపులా వాహనాల రాకపోకలను వీక్షించాల్సిన ట్రాఫిక్ బీట్ షెల్టర్‌కు అడ్డంగా ప్రకటన బోర్డు ఏర్పాటు చేయడం చర్చకు దారితీసింది. ప్రమాదాలకు నిలయమైన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద ట్రాఫిక్ సిబ్బంది వాహనాల రాకపోకలను వీక్షించాలి. సిబ్బందికి ఎండ, వాన నుంచి రక్షణ కోసం బీట్ షెల్టర్ ఏర్పాటు చేశారు. అయితే బీట్ షెల్టర్‌ను ఒకవైపు మూసేసి ఎవరో ప్రకటన బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో షీలానగర్ నుంచి గాజువాక వైపు వచ్చే వాహనాల రాకను సిబ్బంది గుర్తించలేని పరిస్థితి ఏర్పడింది. షెల్టర్‌కు అడ్డంగా ప్రకటన బోర్డు ఏర్పాటుపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. అడ్డంగా బోర్డు ఏర్పాటు చేసిన వారిపై ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.


రాసాలమ్మకాలనీలో తుప్పలతో నిండిన కాలువ


చాకలివీధిలో ప్రధాన కాలువ ఇలా ..

రోగాలకు నిలయాలు!



కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86, 87 వార్డుల పరిధిలోని ప్రధాన కాలువలు ప్రమాదాలు, రోగాలకు నిలయంగా మారాయి. ఏ కాలువ చూసినా తుప్పలు ,పొదలతో నిండిపోయాయి.ఫలితంగా ఎక్కడ మురుగు అక్కడే నిలిచిపోతుంది. అంతేకాకుండా కాలువలకు రిటైనింగ్ వాల్స్ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని సమీపంలోని నివాసం ఉంటున్న ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

నిర్వాసితులను వీడని కష్టాలు

విశాఖ ఉక్కు కర్మాగారం నిర్మాణంలో భూములు ఇళ్లు కోల్పోయినవారికి వడ్లపూడి ప్రాంతంలో పలు నిర్వాసిత కాలనీలు నిర్మించారు. ఆయా కాలనీల్లో నిర్వాసితులతోపాటు ఉక్కు ఉద్యోగులు కూడా వేలాది మంది నివాసం ఉంటున్నారు. కాలనీల నిర్మాణం చేసినప్పుడు విశాలమైన రోడ్లు అందుకు తగ్గకాలువలు నిర్మించారు. అయితే చిన్న చిన్న కాలువల నీరు అంత పల్లపు ప్రాంతాలకు ప్రవహించేలా పెద్ద పెద్ద కాలువలు కూడా ఏర్పాటు చేశారు. అయితే వాటి నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి రిటైనింగ్ వాల్స్ కూడా నిర్మించడానికి అధికారులు ముందుకు రాకపోడడంతో ప్రధాన కాలువలు అధ్వానంగా మారాయి. వాటి అంచున నివాసం ఉంటున్న వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. వర్షాలు పడితే కాలువలకు గండిపడి ఇళ్లు ఎక్కడ కూలిపోతాయోనని భయంతో ప్రజలు బేంబేలు ఎత్తిపోతున్నారు. ముఖ్యంగా అప్పికొండ,కణితి కాలనీ, వడ్లపూడి, లక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో కాలువలు అడవులను తలపిస్తున్నాయి. రాజీవ్‌నగర్ ప్రాంతలో కాలువల రూపాలే మారిపోయాయి. పెద్దపెద్ద చెట్లతోపాటు చెత్త చెదారం కాలువల్లో దర్శన మిస్తున్నాయి.

కాలువలను శుభ్రం చేయడం లేదు

ప్రధాన కాలువల నిర్వహణను పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అన్ని కాలువలు చెట్లు పొదలతో నిండిపోయాయి. దుర్వాసన వెదజల్లుతోంది. పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో క్రిమికీటకాల బెడద కూడా పెరిగింది. రిటైంగ్‌వాల్స్ లేక పోవడంతో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది.

– బోండా గోవిందరాజులు, వడ్లపూడి

దుర్వాసనతో అవస్థలు



కాలువలు శుభ్రంగా ఉంటేనే నిర్వాసిత కాలనీలు పరిశుభ్రంగా ఉంటాయి. అధికారులు పట్టికోకపోడం వల్ల ప్రధాన కాలువల్లో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. దీని వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. రోగాలు రావడం పరిపాటిగా మారింది.

– ఎల్‌బీసీ నాయుడు, ఆర్‌హెచ్ కాలనీ

పిచ్చి మొక్కలు తొలగించాలి



జీవీఎంసీ సిబ్బంది చిన్న కాలువపైనే దృష్టి సారిస్తున్నారు. పెద్ద కాలువలను పట్టించుకోకపోవడంతో చెత్తా చెదారం పేరుకుపోతుంది. పిచ్చి మొక్కలు కూడా పెరిగిపోయి. కాలువల రూపాలే మారిపోతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు వ్యర్థాలను బయటకు తీసి మురుగు ప్రవాహానికి లైన్ క్లియర్ చేయాలి.

– చిత్రాల గంగారాజు,రాజీవ్‌నగర్

విషకీటకాల బెడద



కాలువల వెంబడి పిచ్చితుప్పలు పెరిగిపోవడంతో ఎటువైపు నుంచి ఏ పురుగు వస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. తుప్పల వల్ల మురుగు ప్రవాహం సక్రమంగా సాగకపోవడంతో వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. అది చాలదన్నట్టుగా చికెన్ సెంటర్లు, కోళ్లఫారాల యజమానులు వ్యర్థాలను అక్కడే పడేస్తుండడంతో అవి కుళ్లిపోతున్నాయి. వాటి వల్ల వెలువడిన దుర్వాసనతో రోగాల పాలు కావాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్త చేస్తున్నారు.


అడవిని తలపిస్తున్న రాజీవ్‌నగర్ ప్రధాన కాలువ

క్షయ రోగులకు వైద్యసేవలపై ఆరా


టీబీ రోగులకు అందుతున్న సేవలను పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెన్సీ బృందం

అగనంపూడి: క్షయవ్యాధి గ్రస్తులకు అగనంపూడి ఆస్పత్రిలో అందుతున్న సేవలు, మందుల పనితీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) కన్సల్టెన్సీ బృందం మంగళవారం పరిశీలించింది. టీబీ రోగుల వివరాలు, వారికి అందుతున్న సేవలు, రికార్డులు, వారికి చేస్తున్న పరీక్షల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులతో మాట్లాడి సకాలంలో మందులు అందుతున్నాయా, మందుల ప్రభావం ఎలా ఉంది, ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులు పని చేస్తున్నాయా లేదా అనే అంశాలపై ఆరా తీశారు. అలాగే క్షయ వ్యాధి బాధితులకు ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతుందా లేదా అని తెలుసుకున్నారు. ఆన్‌లైన్ సర్వీస్ ద్వారా వైద్యసేవలు ఎలా పొందాలి, మందులు ఎలా తీసుకోవాలి అనే అంశాలపై రోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెన్సీ బృంద ప్రతినిధులు డాక్టర్ వసుంధర, జయసాయి, శ్లోగ్యాశ్రీ, అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి. ఉష, క్షయవ్యాధి నిపుణురాలు డాక్టర్ ప్రత్యూష, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, ఐసీటీసీ కౌన్సిలర్లు రవికుమార్, కళావతి పాల్గొన్నారు.

దార్శనికుడు అంబేడ్కర్


అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు స్టీల్‌ప్లాంట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్ సీఆర్ఎంపీ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో విభాగం జనరల్ మేనేజర్ ఎస్.రవి, డీజీఎంలు వై. బాలకోటయ్య, నాయక్, సమధర్, ఎస్. దేవానంద్, సుబ్రమణ్యం, అమరాన్, ఆర్‌ఈడీ ఇన్‌చార్జి తేజ, డీజీఎంలు కిన్నెర మేఘన, ధనంజయ్, జె. కాళిదాస్‌లు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీఎం రవి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోని రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని తీర్చిదిద్దారన్నారు. ఆయన దూరదృష్టితో రాసిన రాజ్యాంగం దేశానికి దిక్సూచిగా మారిందన్నారు. అలాంటి దార్శనికుడి ఆశయ సాధన కోసం కృషి చేయడం ఆయనకు ఇచ్చే నివాళి అని అన్నారు. ఎస్. రమేష్ కుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పాల అప్పలరెడ్డి, శశిరెడ్డి, పి. సోమునాయుడు, పి. అప్పారావు, కె. తావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నాలపై ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

గాజువాక: గతంలో ప్రభుత్వంతో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 17నుంచి చేపట్టనున్న ధర్నాలపై జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గాజువాక జోన్‌లోని వివిధ వార్డుల్లోని మస్టర్ పాయింట్ల వద్ద యూనియన్ నాయకులు మంగళవారం కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. ధర్నాలను జయప్రదం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. గాజువాక జోనల్ కార్యాలయం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు పనిముట్లు పంపిణీ, సేఫ్టీ పరికరాలు, మిస్సింగ్ జీతాలు, డైలీ వేజ్ కార్మికులకు బకాయి వేతల చెల్లించాలన్న డిమాండ్లతో ఆందోళనలు నిర్వహించనున్నామని యూనియన్ నాయకులు పి.వెంకటరెడ్డి, గొలగాని అప్పారావు తదితరులు పేర్కొన్నారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు

అక్కిరెడ్డిపాలెం: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు జీడీఏ, ఐసీయూ, ఓటీ అసిస్టెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు షీలానగర్‌లోని బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు బీఎస్సీ, డిప్లమా పారామెడికల్, నర్సింగ్, బీపీటీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7995013421, 7207953919 నంబర్లలో, షీలానగర్ కిమ్స్ ఐకాన్ హాస్పటల్ క్యాంపస్‌లో సంప్రదించాలని సూచించారు.

కూల్.. కూల్


సిద్ధేశ్వరం రోడ్డులో..


సమతానగర్‌లో కురుస్తున్న వర్షం

పెదగంట్యాడ: మండలంలో మంగళవారం మధ్యాహ్నం వరకు భానుడు భగ భగ మండించాడు. ఎండ దెబ్బకు జనం అల్లాడిపోయారు. సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై మబ్బులు పట్టింది. చల్లటి గాలులతో చిరు జల్లులు కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ప్రజలు చల్లటి గాలులను, చినుకులను ఆస్వాదించారు. వేసవి తాపంతో విలవిల్లాడిన ప్రజలకు ఉపశమనం లభించింది.

అంగరంగ వైభవంగా బొర్రమాంబ జాతర

ప్రతి ఇంటా పండగ శోభ


పూజలందుకున్న బొర్రమాంబ


అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


ఆకట్టుకున్న కేరళ డప్పులు, డ్యాన్స్‌లు


అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85, 88 వార్డుల్లో విస్తరించిన అగనంపూడి, పరిసర 8 గ్రామాల కొంగు బంగారం, ఇలవేల్పు బొర్రమాంబ జాతరను మంగళవారం అంగరంగ వైభవంగా జరిపించారు. తెల్లవారు జాము నాలుగు గంటల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రతీ వీధితో పాటు ఇళ్లను విద్యుత్ దీపాలతో అలంకరింపజేశారు. దసరా, సంక్రాంతి పండగల కంటే బొర్రమాంబ జాతరను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడంతో బంధువులు, స్నేహితులతో ఇళ్లన్నీ కళకళలాడాయి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా చేరుకున్నారు. దీంతో అగనంపూడి, ఫార్మాసిటీ నిర్వాసితకాలనీలు, లంకెలపాలెం, పరవాడ, దువ్వాడ, కూర్మన్నపాలెం, గాజువాక, స్టీల్‌ప్లాంట్ సెక్టార్ల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోడానికి వచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు భక్తులతో బొర్రమాంబ వనం కిటకిటలాడింది. సాయంత్రం అమ్మవారిని భారీ ఊరేగింపుగా తీసుకువెళ్లారు. మొట్ట మొదటిసారిగా కోల్‌కతా లైటింగ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. బల్లవేషాలు, నేలవేషాలు, తప్పెటగుళ్లు, సాము గరిడీలు, కోయిడ్యాన్స్‌లు, జానపద నృత్యాలు, కోలాట ప్రదర్శనల నడుమ అమ్మవారి ఊరేగింపు చేశారు. ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

ఘనంగా అన్నసమారాధన


ప్రసాదాన్ని భక్తులకు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు గొన్నవానిపాలెం గ్రామదేవత బొర్రమ్మతల్లి జాతర మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరిపించారు. గ్రామంలోని వేపచెట్టు వద్ద అమ్మవారిని తలచుకొని పూజలు చేశారు. చీర, సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. తరువాత ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు గొన్నా రమాదేవి, ఇల్లపు ప్రసాద్, గుమ్మల శ్రీను, బొరయ్యనాయుడు, బలిరెడ్డి సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, రమణమ్మ పాల్గొన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన


గ్యాస్ సిలిండర్ నుంచి వెలువడిన మంటలను ఎలా ఆర్పాలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంట వెలువడినప్పుడు మహిళలు భయాందోళనకు గురవ్వకుండా నార సంచితో మంటలను అదుపు చేయవచ్చునని ఏడీఎఫ్‌వో ఎస్.గోపీకృష్ణ అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం గాజువాక చేపల మార్కెట్ వద్ద అగ్నిప్రమాదాలు సంభవిస్తే ఎలా ఎదుర్కోవాలో మహిళలు, వ్యాపారులకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇళ్లలో గ్యాస్ సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు వెలువడే సమయంలో మహిళలు భయాందోళన చెందకూడదని తెలిపారు. దుప్పటి వంటి వస్త్రాన్ని నీటిలో తడిపి మంటలు వ్యాపిస్తున్న సిలెండర్‌పై చుట్టేయాలని సూచించారు. కార్యక్రమంలో పెదగంట్యాడ అగ్నిమాక కేంద్ర ఎల్‌ఎఫ్ వి.రాజు, డీవోసీ ఎస్.నాయుడు, ఫైర్‌మెన్స్ ఎం.సురేష్, కె.మంగునాయుడు, డి.అనిల్ మార్క్స్, హెచ్‌జీ సీహెచ్.రాములు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని పెదగంట్యాడ అగ్నిమాపక దళ అధికారులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడలోని చేపల మార్కెట్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రమాదాలు సంభవించిన వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా


స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న శంఖబ్రత బాగ్చి

సీపీ శంఖబ్రత బాగ్చి

ఉక్కునగరం: నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మంగళవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌ను మొత్తం నిశితంగా పరిశీలించారు. పరిసర ప్రాంతాలను వ్యర్థాలతో నింపకుండా ఆవరణలో మొక్కలు నాటాలని ఆదేశించారు. టౌన్‌షిప్‌లో దొంగతనాలు, అసాంఘిక చర్యలు జరకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు మరిన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్లు, అనుమానితుల కదలికలను గమనించాలన్నారు. స్టేషన్ ఆవరణలో ఉన్న పెండింగ్ వాహనాలను పరిశీలించి వాటి డిస్పోజల్‌కు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్‌ను మంగళవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సందర్శించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలని సూచించారు.